నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
8 | వరంగల్, సోమవారం 2 జూన్ 2025 | MAHABUBABAD

గతేడాది తక్కువ పెట్టుబడితో రెట్టింపు ఆదాయం రావడంతో పాటు పలు కంపెనీలు 'మీరు సాగు చేయండి, మేము కొనుగోలు చేస్తాము' అంటూ ప్రోత్సహించడంతో రైతులు ఆశపడి భారీ ఎత్తున పొగాకు పంటను సాగు చేశారు. ప్రస్తుతం కొనుగోళ్ల సమయం వచ్చే వరకు వ్యాపారులు ముఖం చాటేశారు. రాష్ట్రంలో సుమారు 80 వేల టన్నుల పొగాకు రైతుల వద్దే పేరుకుపోగా, కేవలం 30 వేల టన్నుల వరకే కొనుగోళ్లు జరిగినట్లు చెబుతున్నారు. ఇటు అధికారులు గానీ, అటు ప్రభుత్వం గానీ పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. – హనుమకొండ సబర్బన్, జూన్ 1

ఆరబెట్టిన పొగాకు ఆకులు

పొగబెట్టేశారు..

- పొగాకు పంట కొనుగోలుకు ముందుకురాని కంపెనీలు
- సాగుకు ప్రోత్సహించి మొఖం చాటేసిన వ్యాపారులు
- ఆందోళనలో రైతులు.. పట్టించుకోని సర్కారు
- రైతుల వద్దే వేల క్వింటాళ్ల నిల్వలు

రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా పొగాకు పంటను సాగు చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ. 15 నుంచి 16వేల ధర పలుకగా, ఎకరాకు నికరంగా ప్రతి రైతుకు రూ. లక్షా 50 నుంచి లక్షా 80వేల వర కు గిట్టుబాటయ్యాయి. దీనికి తోడు పలు పొగాకు కంపెనీలు తామే కొంటాం, మీరు ఎన్ని ఎకరాలైనా సాగు చేయండని చెప్పడంతో సాధారణ విస్తీర్ణం కంటే ఈ సారి మూడు రెట్లు సాగు పెరిగింది. కోతులు ముట్ట కపోవడం, తెగుళ్లు, పురుగు తక్కువగా ఉండడంతో ఈ పంట వైపు రైతులు మొగ్గు చూపారు. తీరా పంట పండిన తర్వాత కొనుగోళ్ల విషయంలో ఆయా కంపెనీలు మొఖం చాటేశాయి. ప్రధానంగా రాష్ట్రంలో బర్లీ, వర్జీనియా, కేఎఫ్‌సీ లాంటి రకాలను సాగు చేసిన రైతులు మొత్తం సంక్షోభంలోకి వెళ్లిపోయారు. గత సంవత్సరం డెక్కన్, వీఎస్‌టీ, జీఫై, వెంకటసాయి టొబాకో కంపెనీలు పోటీ పడి రైతుల నుంచి పొగాకును కొనుగోలు చేశాయి. ఈసారి వీఎస్‌టీ మాత్రం కొంత మేరకు తీసుకుంది. అది కూడా ధరలో దగా చేసినట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. మంచి నాణ్యత ఉన్న పొగాకు ఆకులను సైతం మూడు నుంచి 5 వేల లోపే కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. కొనుగోళ్ల విషయంలో పలు ప్రాంతాల్లో రైతులు ఇప్ప టికే పోలీసు స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. అయితే తమకు కావాల్సిన అవసరానికంటే రైతుల వద్ద పెద్ద మొత్తంలో నిల్వలు ఉన్నాయని, తాము కొనుగోళ్లు చేయలేమని కంపెనీ ప్రతినిధులు చెబు తున్నారు. పొగాకు కొనుగోళ్ల విషయంలో మార్కెటింగ్ శాఖకు కూడా ఎలాంటి ఆదేశాలు లేకపో వడంతో వారు దీనిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. సాధారణంగా చైనా, జర్మనీ, జింబాబ్వే లాంటి దేశాలకు మన దేశం నుంచి స్థానిక అవసరాలు పోను ఎగుమతి అవుతుంటాయి. అయితే పలు దేశాల్లో సైతం పొగాకు విస్తీర్ణం పెరగడంతో ఎగుమతులు ఉండడం లేదని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు. పొగాకు సాగు విషయంలో టొబాకో బోర్డు ఉన్నప్పటికి ఎలాంటి పనితీరు ను కనబర్చడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేస్తున్న ప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి వచ్చే ఏడాది రైతులు ఎక్కువ మొత్తంలో పంట సాగు చేయకుండా చూస్తే సరిపో తుందని పలువురు రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

నేను మూడు ఎకరాలు పెట్టిన..

గత సంవత్సరం మా చుట్టాలు పొగాకు పంట వేస్తే మంచి లాభాలు వచ్చాయని చెబితే నేను కూడా ఈ సారి పంట వేసి మంచి దిగుబడులు తీసిన. ఆకు కత్తిరించి రెండు నెలలు అవుతుంది. తోటను కూడా తీసివేసి మళ్లీ వర్షాకాలం పంట కోసం సిద్ధం చేసిన. ఇప్పటి వరకు పొగాకును మాత్రం కొనలేదు. ధర పూర్తిగా అధ్వానంగ ఉంది. పోయినేడు మంచి ధర పలికిందంటే ఆశతో పంట వేస్తే కంపెనీలు రైతులను నిండా ముంచాయి. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎడెల్లి లింగారెడ్డి, రైతు, ఎల్కతుర్తి

ధర పూర్తిగా తగ్గించారు

నేను రెండెకరాల్లో పొగాకు పంట యేసిన. దిగుబడి మంచిగనే వచ్చింది. ఎకరానికి లచ్చ యాభై వేలు వత్తయనుకున్న. తీరా ఇప్పుడు అమ్ముదామనుకుంటే అగ్గువకు అడుగుతాన్లు. కొన్ని దిక్కుల రూ.10 వేల నుంచి 12 వేలు పెట్టి కొంటున్నరట. మాదగ్గర మాత్రం అడ్డికి పావుశేరు అన్నట్లుగ జేత్తాన్లు. కట్టలు కట్టి రెండు నెలలు అయితాంది. పొగాకు మాత్రం కొంటలేరు. పోలీసు ఠాణాకు బోయినం. అయిన మాకు న్యాయం జరుగతలేదు. సర్కారు ముందటికొచ్చి మా దగ్గర ఉన్న పొగాకు కొనె టట్లు చెయ్యాలె. మళ్లేడు పెట్టకున్న మంచిదే గని ఈసారి అయితే కొనేటట్లు సూడున్లి. లేకపోతె సావుమర్ణమే అయితది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన. – వలిగె సాంబయ్య, రైతు, చింతలపల్లి

ఏల్లెలకు పాకిన మాఫియా

- రియల్ పడగలో పచ్చని పంట పొలాలు భస్మం
- వ్యవసాయ భూముల్లో అక్రమంగా వెంచర్లు
- నాలా కన్వర్షన్, లేఅవుట్ పర్మిషన్ లేకుండానే దర్జాగా విక్రయాలు
- మామూళ్ల మత్తుల్లో పట్టించుకోని యంత్రాంగం

ఐనవోలు: పంథినిలో మడికట్టు పొలంలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లు

ఎయిర్‌పోర్ట్ ఎరగా రియల్ దందా!

ఇన్ని రోజులు నగరాలు, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన రియల్ ఎస్టేట్ మాఫియా ఇప్పుడు పల్లెలనూ పట్టి పీడిస్తున్నది. వ్యవసాయ భూములు, పచ్చని పంట పొలాలను టార్గెట్‌గా చేసుకొని అక్రమార్జనకు తెగబడింది. ఏటా రెండు పంటలు పండే భూములు సైతం రియల్ పడగలో భస్మమవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులతోపాటు ఖద్దరు దుస్తులు ధరించిన కొందరు పలుకుబడి ఉన్న రాజకీయ నేతలు మామునూరు ఎయిర్‌పోర్టును ఎరగా చూపి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. రైతుల దగ్గర వ్యవసాయ భూమిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, నాలా కన్వర్షన్, లే అవుట్ అనుమతుల వంటివి లేకుండానే దర్జాగా విక్రయిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఐనవోలు, పున్నేల్, వెంకటాపురం, గర్మిళ్లపల్లి, కొండపర్తి, సింగారం, ముల్కలగూడెం, నర్సింహులగూడెం గ్రామాల్లో వ్యవసాయ భూములు, పంట పొలాలపై రియల్ మాఫియా కన్నేసి కాజేస్తున్నది. మామునూర్ ఎయిర్‌పోర్టు పరిధిలోని భూములని నమ్మించి, యథేచ్ఛగా అమ్మకాలు చేపడుతున్నది. ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని పంట పొలాల్లో సబ్‌స్టేషన్ వెనుక నుంచి చింతకుంటకు వెళ్లే మడికట్టును ఆనుకొని సర్వే నంబర్ 127, 126 వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. అయితే, ఈ సర్వే నంబర్లలోని భూమిలో అసైన్డ్ ల్యాండ్ ఉన్నట్లుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నది. ఇవేమీ పట్టించుకోని రియల్ మాఫియాలో ఆ భూమిని ప్లాట్లుగా మార్చి, అంగట్లో పెట్టి గజానికి వేలాది రూపాయల చొప్పున అమ్ముతూ జేబులు నింపుకుంటున్నది. ఇలాంటి అనుమతి లేని అక్రమ వెంచర్లలో భూములు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ఇబ్బందులు తప్పవు. ఇదే గ్రామంలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయని అడ్డుకున్న అధికార యంత్రాంగం.., అక్రమ వెంచర్లు వెలుస్తుంటే మాత్రం పట్టించుకోవడం లేదంటే అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక నిబంధనలను నుంచి తప్పించుకునేందుకు రియల్ వ్యాపారులు ప్లాట్లను గజాల్లో కాకుండా గుంటల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తూ ప్రభుత్వానికి ఫీజు ఎగ్గొడుతూ.., కొనుగోలుదారులను సైతం మోసం చేస్తున్న మాఫీయాకే అధికారులు వంతపాడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులకు తెలిసినా పట్టించుకోని పరిస్థితి..

వ్యవసాయ భూములను ఎలాంటి అనుమతి లేకుండా వ్యవసాయేతర భూములుగా సులువుగా మార్చేస్తున్నారు. అధికారుల కండ్ల ఎదుటే ఈ తతంగం జరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటే.., దందాలో వీరి ప్రమేయం కూడా ఉండొచ్చుననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే కాకుండా రియల్ మాఫీయా వ్యవసాయ భూమిని కాగితంపై వెంచర్ చేసి, గుంటల లెక్కన రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, ఆ గుంట భూమికి ఇటు రైతుబంధు, అటు రైతు బీమా వస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ మాఫియా తమ పని తాము చేసుకుంటూ పోతుంటే అధికారులు మాత్రం కిమ్మనకుండా తమవంతు సహకారం అందిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మామూళ్ల మత్తు వీడి, పచ్చని వాతావరణంలో ఉండే ఐనవోలు మండలాన్ని రియల్ ఎస్టేట్ మాఫీయా చేతుల్లో నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రకటనతో దాని పరిసర ప్రాంతాల్లోని భూములకు అమాంతం ధరలు పెరిగాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న రియల్ ఎస్టేట్ మాఫియా ఎయిర్ పోర్టు సమీపంలోని వ్యవసాయ భూములను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లుగా మార్చి దర్జాగా విక్రయిస్తున్నది. ఎయిర్ పోర్టును ఎరగా చూపి అమాయక ప్రజల ను మోసం చేస్తున్నది. అధికారుల కండ్లెదుటే ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ఐనవోలు, జూన్ 1

మామునూరు ఎయిర్‌పోర్టు

ఇంకెంతకాలం..?

- కొలిక్కిరాని భూ సేకరణ ప్రక్రియ
- ఫిబ్రవరి 28న కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మూడు నెలలు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

కరీమాబాద్, జూన్ 1 : ఎయిర్‌పోర్టు నిర్మాణం జిల్లా ప్రజల దశాబ్దాల కల. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి గతంలోనే ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 28న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా, ప్రభుత్వం, అధికారులు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులపై అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూ సేకరణ చేపట్టి తమకు అప్పగిస్తే, మూడేండ్లలో నిర్మాణం పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి పలు సందర్భాల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి వచ్చి 3 నెలలు గడిచినా భూసేకరణ ప్రక్రియ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది. తమకు న్యాయం చేయాలని రైతులు, పలు గ్రామాల ప్రజలు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో ఎవరి భూమి ఎంత పోతుతున్నదనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదని తెలుస్తున్నది. భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం ఎంత ఇస్తారు..?, ఎలా ఇస్తారు అనే విషయాన్ని ఎవరూ చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. కేంద్రం అనుమతి ఇచ్చిన వారం పది రోజులు హడావుడి చేసిన అధికారులు.. ఇప్పుడెవరూ కానరావడంలేదని రైతులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటన వచ్చి మూడు నెలలు గడుస్తున్నా భూ సేకరణ అంశం కొలిక్కి రాలేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆధీనంలో సుమారుగా 696 ఎకరాలు ఉన్నట్లు తెలిసింది. దాదాపు మరో 253 ఎకరాల స్థలం కోసం అధికారులు భూ సేకరణ సర్వే చేపట్టారు. 1930లో నిర్మించిన మామునూరు విమానాశ్రయం 1981 వరకు సేవలను అందించినట్లు పలువురు పేర్కొంటున్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ప్రజల ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడనున్నది. వ్యాపార, పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందనుంది. అధికారులు పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హామీ కోసం ఎదురుచూపులు..

మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణం తప్పనిసరిగా జరుగుతుందని అందరికీ తెలుసు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థానిక రైతులు కూడా సుముఖంగా ఉన్నారు. అందుకోసం అవసరమైన భూమి ప్రభుత్వం తీసుకుంటుందని ఇక్కడి ప్రజలు సైతం నిర్ణయించుకున్నారు. కానీ, స్పష్టమైన హామీ కోసం రైతులు, ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాల్సిన అధికారులు వీలున్నపుడు పిలుస్తూ కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు రాగానే మా ఘనతే అంటూ సంబురాలు చేసుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పనుల వేగానికి, రైతులకు ఇచ్చే పరిహారంలోనూ చొరవ చూపితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భూ సేకరణకే ఇంత సమయం పడితే ఇక నిర్మాణం ఇంకెంతకాలం పడుతుందోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు

సభ్యత్వాల ముసుగులో రూ.2 కోట్లు స్వాహా

- వరంగల్ ఆఫీసర్ క్లబ్‌లో అక్రమాలు
- మేనేజర్ గోపాల్‌రెడ్డి, మాజీ కార్యదర్శి రాజిరెడ్డి, మరొకరి అరెస్ట్
- వెల్లడించిన సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

→ 6

ప్రశాంతంగా ఎడ్‌సెట్

- పరీక్ష రాసిన 32,106 మంది అభ్యర్థులు
- 83శాతం హాజరు నమోదు

మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

ప్రజా ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం

- తెగించి కొట్లాడిన నాయకుడు కేసీఆర్
- నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్రావతరణ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు
- సమావేశంలో దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, జూన్1: 'ప్రజా ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అని తెగించి కొట్లాడిండు. సకల జనులను ఏకం చేసి గమ్యాన్ని ముద్దాడిన మహా నాయకుడు కేసీఆర్' అని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను ఒకేఒక్కడుగా బయలుదేరి అలుపెరుగని పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని పదేండ్లలో దేశంలోనే అగ్రభాగన నిలిపిన గొప్ప పరిపాలన దక్షుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు 420 హామీలు, 6 గ్యారెంటీలు ఇచ్చింది కానీ ఈ 18 నెలల కాలంలో ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హామీలు అమలు చేసే వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతున్నదని అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు పార్టీ ద్రోహం, దగా చేశాయన్నారు. ప్రజలు ఇప్పుడు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. గాంధీ, అంబేద్కర్ మార్గాల్లో నాడు ఉద్యమాన్ని, ఆ తర్వాత ప్రభుత్వాన్ని కేసీఆర్ నడిపారని, ఆయన హయాంలో సంక్షేమం, అభివృద్ధి రెండే జెండాగా ముందుకుపోయాయని, అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ పదేండ్ల పాలనలో ఏనాడూ తెలంగాణకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిన పాపాన పోలేదని ఆయన పేర్కొన్నారు. విభజన హామీలను కూడా అమలు చేయకుండా తుంగలో తొక్కిందన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు తెలంగాణకు తెచ్చిన నిధులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చిరువ్యాపారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు.

జిల్లావ్యాప్తంగా వేడుకలు

రాష్ట్ర అవతరణ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. గ్రామగ్రామాన జాతీయ పతాకంతో పాటు పార్టీ జెండాను ఎగరవేయాలని, కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల్లోనే ఎండగట్టాలని పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా మాజీ రాజ్య సభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్, ఇమ్మడి లోహిత, నల్లా స్వరూపారాణి, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు ఇమ్మడి రాజు, వీరేందర్, రఘు, చాగంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో హనుమకొండ కలెక్టరేట్

ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు

- అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న అతిథులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం అన్ని కలెక్టరేట్లతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించనుండగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అతిథులు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వరంగల్ కోటలో జరిగే వేడుకలకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కొండా సురేఖ, ములుగులోని తంగేడు మైదానంలో మంత్రి సీతక్క, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మహబూబాబాద్‌లో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, జయశంకర్ భూపాలపల్లిలో తెలంగాణ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హాజరుకానున్నారు. ఈమేరకు సమీకృత కలెక్టరేట్లు, సభా వేదికలను విద్యుత్ దీపాలతో అలంకరించి అందంగా ముస్తాబు చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలిపేలా స్టాళ్ల ప్రదర్శన, విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పాలకుర్తిలో ఉద్రిక్తత

- రాజుకున్న తెలంగాణ తల్లి విగ్రహ వివాదం
- ఉషా దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట.. ప్రతిఘటించిన శ్రేణులు
- నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తల ముందస్తు అరెస్టు

పాలకుర్తి, జూన్ 1: రెండు రోజులుగా పాలకుర్తిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ తల్లి విగ్రహ గద్దె నిర్మాణ వివాదం రాజుకుంది. బీఆర్ఎస్ కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆధిపత్య పోరు సాగింది. కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో గూండాయిజం చేస్తూ రాత్రికి రాత్రే గద్దె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిగా ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషా దయాకర్‌రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వస్తుండగా వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఉషా దయాకర్‌రావు కొంత అస్వస్థతకు గురైంది. అయినా పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆవేశంతో రగిలిపోయారు. పోలీసు జులుం నశించాలి...పోలీసులు డౌన్‌డౌన్.. కాంగ్రెస్ గూండాయిజం నశించాలి అంటూ నినాదాలు చేశారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని మండిపడ్డాయి. పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ఉషా దయాకర్‌రావు నిలదీయడంతో చివరకు పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను విడిచి పెట్టడం తో స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఉషా దయాకర్‌రావు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఝాన్సీ రెడ్డిపై కేసు నమోదు చేయాలి : ఉషా దయాకర్‌రావు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఝాన్సీరెడ్డిపై ఫిర్యాదు చేసిన ఆనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విదేశీయురాలైన ఝాన్సీరెడ్డికి భారత పౌరసత్వం ఉందా అని ప్రశ్నించారు. ఓటు హక్కులేని ఝాన్సీరెడ్డికి కుర్చీలు వేసి మర్యాదలు చేసిన పోలీసులు 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భార్యనైన తనకు మర్యాద ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పోలీసులు మహిళను అని చూడకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా అని మండిపడ్డారు. పాలకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఝాన్సీరెడ్డినా, ఆమె కోడలు యశస్వినీరెడ్డినా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఝాన్సీరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టించడం ఎంత వరకు సమంజసమన్నారు. పోలీసులు కాంగ్రెస్ తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. పాలకుర్తిలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. 15 ఏళ్లుగా పాలకుర్తి నియోజకవర్గానికి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండి వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాడని చెప్పారు. ఏనాడూ ఘర్షణ రాజకీయాలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అభివృద్ధిలో పోటీ పడాలని సవాల్ విసిరారు. 17నెలల కాంగ్రెస్ పాలనలో పాలకుర్తి నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. అధికారం చేతిలో ఉందని బీఆర్ఎస్ శ్రేణులను బెదిరింపులకు గురి చేస్తూ ఝాన్సీరెడ్డి, ఆమె కోడలు యశస్వినీరెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఝాన్సీరెడ్డి పోలీస్ అధికారులను దుర్భాలాషలాడుతూ ఎస్సైని తిట్టడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జోగు గోపీపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం అమానుషమన్నారు. కాంగ్రెస్ గుండాల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న గోపీని ఉషా దయాకర్‌రావు పరామర్శించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, తాము త్వరలోనే అధికారంలోకి వస్తామన్నారు. వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. పోలీసు అధికారుల్లారా ఖబర్దార్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆధైర్య పడొద్దని, అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను ముందస్తు అరెస్టులు చేయడం అక్రమమన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, తీగల దయాకర్, మూనావత్ నర్సింహానాయక్, ఈదూరు ఐలయ్య, వసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీలు మంగళంపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీలు